క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని గుండెలుగుంట, రాంబట్లపల్లి, చియ్యవరం, పిల్లమేడు పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పరీక్షా సామగ్రిని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మునెమ్మ, హెచ్‌ఎలు ముని తిరుమలయ్య, ఉపాధ్యాయులు చెంచయ్య, మస్తాన్‌రావు, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగస్థల అభివృద్ధికి కృషి


సమావేశమైన రంగస్థల కళాకారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో సోమవారం ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం జరిగింది. పట్టణంలోని సదాశివ టవర్స్‌లో రంగస్థల కళాకారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు తాము వేసిన పాత్రలను నెమరు వేసుకున్నారు. రంగస్థల అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో సాంబ రషీద్, పసల కృష్ణయ్య, అల్లం మణి, పూడి శ్రీనివాసులు, మాధవ, తులసి, వాణి, పొట్టి మామా, ప్రజ్వల్, కృపారావు, ఆశ, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఆమందూరు పంచాయతీకి రూ.10 లక్షల ఆదాయం


వేలం నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

ఏర్పేడు: మండలంలోని ఆమందూరు పంచాయతీకి వాణిజ్య సముదాయ గదుల వేలం ద్వారా రూ.10,73,448 ఆదాయం చేకూరింది. సోమవారం ఆమందూరు సచివాలయంలో వైస్ ఎంపీపీ జమ్మల శ్రీనివాసులు, ఎంపీడీఓ గిడ్డయ్య ఆధ్వర్యంలో 7 గదులకు వేలం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు వేలంలో ఓ ఏడాదికి వీటిని దక్కించుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చిన్నజీయర్‌స్వామికి సాదర స్వాగతం


చిన్నజీయర్ స్వామి నుంచి ప్రసాదం స్వీకరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రేణిగుంట: తిరుమల పర్యటన నిమిత్తం సోమవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న త్రిదండి పీఠాధీశులు చిన్నజీయర్ స్వామికి సాదర స్వాగతం లభించింది. ఆయనకు విమానాశ్రయంలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ మోహిత్‌రెడ్డిని ఆయన ఆప్యాయంగా పలకరించి ఆపిల్ పండును ప్రసాదంగా ఇచ్చి మంచి భవిష్యత్ కలగాలని అక్షితలు వేసి ఆశీస్సులు అందించారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయల్దేరి వెళ్లారు.

రెండవ పట్టణ సీఐగా మల్లికార్జున



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐగా మల్లికార్జున సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో నారాయణవనం, మదనపల్లె, వాయల్పాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తూ పదోన్నతిపై సీఐగా నంద్యాలలో రెండు సంవత్సరాలు పని చేశారు. అనంతరంలో డోన్‌లో పనిచేస్తూ బదిలీపై శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పని చేయడం అదృష్టమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు సిబ్బంది సహకారంతో ముందుకు వెళ్తామన్నారు.

అత్యాచార యత్నంపై కేసు నమోదు

ఏర్పేడు: మహిళపై అత్యాచారయత్నం చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి సోమవారం రాత్రి తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ(31)పై అదే గ్రామానికి చెందిన మునిరాజు అత్యాచార యత్నం చేసినట్లు వివరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మునిరాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

మలాథిన్ స్ప్రే

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో దోమల నివారణకు సర్పంచ్ లలిత ఆధ్వర్యంలో సోమవారం మలాథిన్ స్ప్రే చేయించారు. గ్రామంలో మురుగునీటి కాల్వలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, కొళాయిల వద్ద చేరిన మురుగునీటిలో గ్రీన్ అంబాసిడర్లు స్ప్రే చేశారు. ఎండాకాలం ఆరుబయట నిద్రించే ప్రజలకు ఇబ్బందిలేకుండా దోమల నివారణకు కృషిచేస్తున్నట్లు సర్పంచ్ చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

జగనన్నతోనే మహిళాభ్యున్నతి


సమావేశానికి హాజరైన డ్వాక్రా సంఘాల సభ్యులు


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- ఆసరా లబ్ధిదారుల సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: జగనన్న ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి బాటలు వేస్తూ, వారి సంక్షేమానికి కృషి చేస్తోందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. నారాయణవనంలో సోమవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా లబ్ధిదారుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. మండలంలోని 7,780 మంది డ్వాక్రా మహిళా సంఘ సభ్యులకు మంజూరైన మూడో విడత నగదు రూ.7,78,44,000 మెగా చెక్కును వైఎస్సార్ క్రాంతి పథం మండల సమాఖ్య నాయకులకు ఆయన అందజేశారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ మూడేళ్లుగా కరోనా, తుపాను విపత్కర పరిస్థితుల్లోనూ రుణమాఫీ ఆపకుండా అక్కా చెల్లెమ్మలను ఆదుకున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు, అంతేకాకుండా అమ్మ ఒడి, జగనన్న ఇంటి పట్టా, విద్యాదీవెన వంటి ప్రభుత్వ పథకాలన్నీ మహిళల పేరిట పంపిణీ చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మహిళలే పార్టీకి మూల స్తంభాలుగా నిలిచి జగనన్నను 2024 లో మళ్లీ ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు సుదర్శనరెడ్డి, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు ఏకాంబరం తదితరులు ప్రసంగించారు. కార్యక్రమాలలో పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, సచివాలయ మండల కన్వీనర్ కోనేటి బాబు, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, ఎంపీడీవో గుణశేఖర్, తహసీల్దార్ ప్రమీల, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, డ్వాక్రా సంఘాల మహిళా సభ్యులు, సచివాలయాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరుకానున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి తెలిపారు. అర్హత కలిగిన డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందించనున్నారు. అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

బంగారమ్మకు పొంగళ్లు సమర్పణ



విశేష అలంకరణలో బంగారమ్మ, పొంగళ్లతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురంలో సోమవారం బంగారమ్మ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయాన్నే పలురకాల అభిషేకాలు, స్వర్ణాభరణాలతో విశేష అలంకరణ చేశారు. ఆలయంలో కుంకుమార్చన, చండీహోమం నిర్వహించారు. మహిళలు మేళతాళాలతో ఆలయానికి వెళ్లి పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామదాసు, హరిప్రసాద్, రంగయ్య, సుబ్రమణ్యం, గిరిబాబు, కుమార్, మునిరెడ్డి, మునస్వామి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక


ఎంపికైన న్యాయవాదులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి న్యాయస్థానం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మాడుపూరు ప్రసాద్ నాయుడు ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నామినేషన్ ప్రక్రియ జరిగింది. ఎన్నికల ప్రధాన అధికారిగా కె.ఉదయ్‌నాథ్, సి.సుబ్రహ్మణ్యం, జి.రాజేశ్వరరావు వ్యవహించారు. అయితే వేరే నామినేషన్లు దాఖలు కాకపోవడంతో అధ్యక్షుడిగా మాడుపూరు ప్రసాద్‌నాయుడు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వి.మల్లికార్జునయ్య, కార్యదర్శిగా కె.కమల్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎం.చంద్ర, కోశాధికారిగా డి.శశికుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కంఠా ఉదయ్‌కుమార్ ఎన్నికయ్యారు. వీరిని పలువురు న్యాయవాదులు అభినందించారు.

పేదల భూములను అప్పగించవద్దు


సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న పాదిరికుప్పం గ్రామస్తులు

వరదయ్యపాళెం: మండలంలోని పాదిరికుప్పం రెవెన్యూలో స్థానికుల అనుభవంలో ఉన్న భూములను పురావస్తు శాఖకు అప్పగించవద్దని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం సీపీఐ, జనసేన పార్టీలతో కలసి వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. స్థానిక పాదిరికుప్పం గ్రామస్తులు మాట్లాడుతూ, ఏళ్ల తరబడి సర్వే నెంబర్–729లో 30 ఎకరాల వరకు స్థానిక రైతుల అనుభవంలో ఉందని తెలిపారు. తాజాగా రెండు రోజుల క్రితం సర్వే నెంబర్ 729లో గల 65 ఎకరాల భూమి పురావస్తు శాఖకు అప్పగించినట్లు సంబంధిత అధికారులు సరిహద్దును ఏర్పాటు చేసుకునే పనులను ప్రారంభించారు. అంతేకాక సంబంధిత భూమి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టేందుకు త్వరలోనే పనులు చేపడతామని తెలపడంతో సమాచారం అందుకున్న స్థానిక రైతులు ఆందోళన చేస్తున్నట్లు తెలిపారు. పాదిరికుప్పం రెవెన్యూలో గల 65 ఎకరాల భూమిని పురావస్తు శాఖకు అప్పగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సత్యవేడు సీపీఐ కార్యదర్శి చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. స్థానిక రైతులతో కలసి డిప్యూటీ తహసీల్దార్ శాంతికి వినతి పత్రాన్ని అందజేశారు. ఆమె సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమింపజేశారు.

విద్యార్థులతో బల్లలు మోయిస్తారా !


డెస్క్‌లను తీసుకెళ్తున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులతో డెస్కులను మోయించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పాఠశాలలోని డెస్క్‌లను మరోచోటుకు మార్చడం కోసం సోమవారం విద్యార్థుల సాయంతో ట్రాక్టరులోకి ఎక్కించారు. ఈ సందర్భంగా బాలురు ఆ బల్లలను మోయలేక అవస్థలు పడ్డారు. కూలీలతో డెస్క్‌లను మోయించుకోవాలని, విద్యార్థుల సాయంతో ట్రాక్టర్‌కు ఎక్కించిన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


సంతాపం తెలుపుతున్న డీవైఈఓ పి.రఘురామయ్య, ఎంఈఓ రవి

సత్యవేడు: మండలంలోని కన్నావరం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న గిరి గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం అందుకొన్న డీవైఈఓ పి.రఘురామయ్య, ఎంఈఓ కే.రవి వెంటనే గిరి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలకు..


ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: బాగా చదువుకుంటేనే సమాజంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని శ్రీకాళహస్తీశ్వర ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంలో శ్రీనివాసతేజ పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. కరస్పాండెంట్ కంద్రాతి సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు భారత దేశ సంస్కృతిని తప్పనిసరిగా నేర్పిస్తున్నామని తెలిపారు. అనంతరం 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. ప్రజాప్రతినిధులు, మహిళ సంఘాల సభ్యులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


సదస్సులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి

సత్యవేడు: పోషకాహారంతో ఆరోగ్యంగా ఉండొచ్చని, దీనిపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి అన్నారు. సీడీపీఓ కార్యాలయంలో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు న్విహించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ పోషణ్ పక్వాడా ముఖ్య ఉద్దేశం మంచి ఆహారపు అలవాట్లతోపాటు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడమేనన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ఆయా గ్రామాల్లో పౌష్టికాహారంపై పిల్లకు, గర్భవతులకు, బాలింతలకు, తల్లులకు అవగాహన కలిగించి మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకొనేలా కృషి చేయాలని సూచించారు. పోషక విలువలున్న ఆహారంపై గర్భిణులు, బాలింతల్లో అవగాహన పెరగాలన్నారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, పాలల్లో సమృద్ధిగా పోషకాలున్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే వైఎస్సార్ కిట్‌లు, బాలామృతంలో మెండుగా పోషకాలున్నాయని తెలిపారు. సీడీపీఓ దేవకుమారి చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. తల్లి, పిల్లలకు పోషకారం లోపిస్తే ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయన్నారు. పిల్లలు వయసుకు తగ్గ బరువు ఉన్నారా లేదా తరచూ చూసుకోవాలని తెలిపారు. పోషకాహార పదార్థాలు తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యవంతంగా పెరుగుతారని తెలియజేశారు. అంతకుముందు అంగన్‌వాడీ కార్యకర్తల చిరుధాన్యాలు, రాగిపిండి, ఆకూకూరలు, పప్పుదినుసులతో తయారు చేసిన వంటలను ప్రదర్శనగా ఉంచారు. సుమారు 16 రకాల వంటకాలు తయారు చేసి ప్రజాప్రతినిధులు, మండల అధికారులకు పంచిపెట్టారు. మునగాకు ఆవశ్యకతపై ప్రత్యేకంగా పాడిన పాట పలువురిని ఆకట్టుకుంది. ఆరోగ్య సూత్రాలపై దాసుకుప్పం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఓ ఎల్‌వి రమణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ బాలగణేశన్, ఎంఈఓ కే.రవి, ఏపీఎం స్వర్ణలత, కో–ఆప్షన్ సభ్యురాలు మస్తానీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సంఘమిత్రలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఏఎంసీ చైర్మన్ ప్రమాణస్వీకారం



ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వి.సునంద, కార్యక్రమానికి హాజరైన రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పిచ్చాటూరు: అట్టహాసంగా నాగలాపురంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో సోమవారం నాగలాపురం ఏఎంసీ చైర్మన్‌గా వి.సునంద, వైస్ చైర్మన్‌గా జి.ఆనంద రెడ్డి సభ్యులుగా ఎస్.వేదవల్లి, ఎస్.నళిని, వి.వరంధామయ్య, టి.జయరాణి, పి.వంశీక్రిష్ణా రెడ్డి, సి.అలగేశన్, కేఎం షాబుద్దీన్, టి.కులశేఖర్ రెడ్డి, ఎ.గురవమ్మ, వి.బుజ్జి, ఎ.ఆర్.మోహన్. జి.యువరాజు, కేఎస్ మోహన, ఏడీ రమేష్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ అపరంజిరాజు, స్థానిక సర్పంచ్ చిన్నదొరై సుధ ప్రమాణ స్వీకారం చేశారు. సభలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ పదవులు అలంకరించిన ప్రజాప్రతినిధులు రైతులకు ఎల్లవేళలా అండగా ఉండి ప్రభుత్వ పథకాలు వారికి సకాలంలో అందేలా చూడాలన్నారు. ఇందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు సైతం కొత్తగా ఏర్పడిన పాలకవర్గానికి సహకరించాలని సూచించారు.

2024లో వన్స్‌మోర్ కొట్టాలి

గనన్న ముఖ్యమంత్రిగా 2024లో వన్స్‌మోర్ కొట్టాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నందున, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు తమ మధ్య ఉన్న విభేదాలు మాని ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో జగనన్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను విస్తృతంగా తీసుకెళ్లి పార్టీకి అండగా ఉండేలా చూడాలన్నారు. నియోజకవర్గంలో కొంత మంది పార్టీ నాయకులు అనవసర సమస్యలు సృష్టిస్తున్నారని, ఇకనైనా మనస్పర్థలు మాని పార్టీ బలోపేతానికి పని చేయాలని కోరారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని పార్టీ శ్రేణులు శాలువ, గజమాలలతో ఘనంగా సత్కరించాయి. కార్యక్రమంలో జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పాలపద్మనాభం, పార్టీ మండల కన్వీనర్లు అపరంజిరాజు(నాగలాపురం), సుశీల్‌కుమార్ రెడ్డి(సత్యవేడు), నాయకులు చిన్నదొరై, జేబీఆర్ మునిరత్నం, ఆర్‌డీ ఏకాంబరం, సుబ్రమణ్యం రెడ్డి, కందేరి కళ్యాణ్ చక్రవర్తి, శ్యామ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మండల అభిషేక పూజలు


కుంభాభిషేక పూజల్లో పాల్గొన్న పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయాల్లో సోమవారం ఘనంగా మండల అభిషేక పూజలు జరిగాయి. ఇందులో భాగంగా అఖిలాండేశ్వరి సమేత నీలకంఠేశ్వరస్వామి, భక్తకన్నప్ప ఆలయం, అగస్తీశ్వరాలయంలో మండల అభిషేక పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమపూజలు, అభిషేక పూజలు, విశిష్ట అలంకరణలు చేసి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఈ పూజల్లో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయాలకు పూర్వవైభవం కలిగించేలా 30 ఏళ్లుగా కుంభాభిషేకం జరగని ఆలయాలకు అన్నింటికీ కుంభాభిషేకాలు నిర్వహించి మూలవిరాట్‌లకు పూర్వతేజస్సు వచ్చేలా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అభిషేక గురుకుల్, నిరంజన్ గురుకుల్, ఆలయ అర్చకులు కన్నలి సురేష్, అప్పాజీ శర్మ, మోహన్ శర్మ, ప్రసాద్‌స్వామి, పరిచారకుడు గోవిందశర్మ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సీతారాముల వారి ఆలయంలో..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని నక్కహరిజనవాడలో నూతనంగా నిర్మించిన సీతారాముల వారి ఆలయంలో సోమవారం మహాకుంభాభిషేకాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. హోమపూజలు, అభిషేకాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తి ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కుంభాభిషేక పూజల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు గ్రామపెద్దలు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శంకర్, బాబీ, గణేష్, వెంకటరమణయ్య, శివ, మధు, సుబ్రహ్మణ్యం, ఉమాపతి, బాబు, చంద్ర, బాబు, ప్రమీల, మేరమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయండి


తొట్టంబేడు సచివాలయ రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రూపారాణి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): పంచాయతీల్లో వందశాతం పన్నుల వసూలు చేయాలని తిరుపతి జిల్లా డీఎల్‌పీఓ రూపారాణి ఆదేశించారు. సోమవారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ తరుణాక్ష రెడ్డి, పంచాయతీ కార్యదర్శులతో పన్ను వసూలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీ కార్యదర్శి తమ పరిధిలోని పంచాయతీల్లో పన్నులు వసూలు చేసి పంచాయతీల అభివృద్ధికి దోహదపడాలని కోరారు. మొండి బకాయిల వసూళ్లను నోటీసులు ఇచ్చి కోర్టు ద్వారా వసూలు చేయాలని ఆదేశించారు. తిరుపతి జిల్లాలో ఇప్పటివరకు 95 శాతం పన్నులు వసూలు చేసినట్లు ఆమె తెలిపారు. అనంతరం ఆమె తొట్టంబేడు–2 సచివాలయ పరిధిలో పన్నుల వసూళ్ల వివరాలను పరిశీలించారు. ఈనెల 31వ తేదీలోపు 100 శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమెతో పాటు సీనియర్ పంచాయతీ కార్యదర్శి హంస ప్రకాష్, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలికల ఉన్నత పాఠశాలకు ప్రశంసలు


కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న విద్యార్థులు

నారాయణవనం: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులను, విద్యార్థులను కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీ, డీఈవో శేఖర్ ప్రశంసించారు. జిల్లాలో ఆరు ఉన్నత పాఠశాలలను హరిత పాఠశాలలుగా కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ గుర్తించి, పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో పాఠశాల గ్రీన్ కోర్ కమిటీ హెడ్ శ్యామలత, సభ్యులైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. పర్యావరణాన్ని రక్షిస్తూ, ఉష్ణతాపాన్ని తగ్గించడానికి మొక్కలను నాటడమే కాకుండా, చెట్లను రక్షించాలని, వ్యర్థాలపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌కోర్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ నీలకంఠయ్య, జిల్లా కో–ఆర్డినేటర్ శంకర్ పాల్గొని అభినందించారు.

ఎస్‌ఎస్ పురం జెడ్పీ హైస్కూల్‌లో వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థులు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం ఎస్‌ఎస్ పురం జెడ్పీ హైస్కూల్లో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులు ఘనంగా సరస్వతి పూజ చేశారు. 9వ తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. హెచ్‌ఎం ఉదయ చంద్రిక మాట్లాడుతూ ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో పాఠశాలను మండలంలోనే నంబర్‌వన్‌గా నిలపడమే లక్ష్యంగా చదవాలన్నారు. ఉపాధ్యాయులు అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో టీచర్లు బాబు, దీపక్, శ్రీదేవి, రంజిత్‌కుమార్, వెంకటేశ్వర్లు, కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల పంపిణీకి కసరత్తు


ఫైళ్లు సిద్ధం చేయిస్తున్న ఆర్‌ఐ వెంకటసుబ్బయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: త్వరలో జరగనున్న అసైన్‌మెంట్ భూముల పట్టాల పంపిణీ కోసం అనాధీన భూములను త్వరితగతిన సర్వే చేసి, ఫైల్స్ సిద్ధం చేస్తున్నట్లు ఆర్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అసైన్‌మెంట్ భూముల పంపిణీ కోసం వీఆర్‌ఓలు, సర్వేయర్లతో ఫైల్స్ సిద్ధం చేశారు. ఆయన మాట్లాడుతూ అనాధీనం భూములను గుర్తించి, అర్హులైన వారికి అసైన్‌మెంట్ భూముల పట్టాలను త్వరలో పంపిణీ చేస్తామన్నారు. వీఆర్వోలు, సర్వేయర్ల అనాధీనం భూములను సర్వే చేసి, రికార్డులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు పాల్గొన్నారు.